క్లుప్తంగా

విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేసిన దృశ్యం

భీమవరం: గాంధీ జయంతిని పురస్కరించు కొని భీమవరం పట్టణం శ్రీరామపురంలోని గాంధీ కస్తూరిబా భవనం వద్ద గాంధీ ఖేల్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్‌కు నిర్వహించిన పోటీల్లో టి.రమేష్, వై.కిరణ్ విన్నర్స్‌గా నిలివగా ఎ.శివాజీరాజు, ఎం.శ్రీనివాస్ రన్నర్స్‌గా నిలిచారు. విజేతలకు గురువారం జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు బహుతులు అందజేశారు.

ఉద్యోగులు బాధ్యతగా వ్యవహరించాలి



వీడ్కోలు సభ నిర్వహిస్తున్న దృశ్యం

వీరవాసరం: విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తే ప్రజల మన్ననలు పొందొచ్చని ఎంపీడీవో పి.జ్యోతి తెలిపారు. వీరవాసరం ఎంపీడీవో కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న మండల, గ్రామస్థాయి అధికారులకు గురువారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఉద్యోగ నిర్వహణలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఎంతో సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. వీరవాసరం ఎంపీడీవోగా పని చేస్తున్న పి.జ్యోతి బదిలీపై బుట్టాయగూడెం ఎంపీడీవోగా వెళ్లారు. సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న టి.విజయ్ సారథి మచిలీపట్నం బదిలీపై వెళ్లారు. మరి కొంత మంది కార్యదర్శులు బదిలీపై వెళ్లారు. వీరికి మండల పరిషత్ ఆధ్వర్యంలో సత్కారం నిర్వహించారు.

ఉండిలో చోరీ

ఉండి: గత మే 23వ తేదీ నుంచి 25వ తేదీ మధ్యలో ఉండి కాపులపేట చెన్నంశెట్టి వారి వీధిలో జరిగిన చోరీపై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఉండి కాపులపేట చెన్నంశెట్టివారి వీధికి చెందిన నేరెళ్ల సతీష్‌బాబు ఈ ఏడాది మేలో 23, 25 తేదీల మధ్య ఇంటికి తాళం వేసి విహారయాత్రకు వెళ్లాడు. అయితే ఈ మధ్యలో స్థానికంగా ఓ ఎలక్ట్రీషియన్ విహారయాత్రలో ఉన్న సతీష్‌బాబుకు ఫోన్ చేసి ఇంటి తలుపుతులు తెరచి ఉన్నాయని చెప్పడంతో అతను వచ్చి ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. ఈ చోరీలో నాలుగు గ్రాముల జత చెవి కమ్ములు, 100 గ్రాముల వెండి వస్తువులు, రెండు సెల్‌ఫోన్లు పోయినట్లు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై హెడ్ కానిస్టేబుల్ డి.రవి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి

ఉండి: ఎన్నార్పీ అగ్రహారం పరిధిలోని పాల కేంద్రం సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. విస్సాకోడేరు సంతపేటకు చెందిన రమేష్ ఉండిలో పని చేసేందుకు ద్విచక్ర వాహనంపై వచ్చి, తిరిగి వెళుతుండగా భీమవరం వైపు నుంచి వస్తున్న ఓ కారు అతి వేగంతో ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. కారు ఆగకుండా వెళ్లిపోయింది. దీంతో అదే ప్రాంతంలో ఉన్న పలువురు కారును వెంబడించేందుకు ప్రయత్నించినా లాభం లేకపోవడంతో బాధితుడిని ఆదుకునే ప్రయత్నం చేశారు. బాధితుడి ద్వారా వివరాలు తెలుసుకొని కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. 108 ద్వారా బాధితుడిని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అయ్యప్ప స్వాములకు భిక్ష ప్రారంభం



అయ్యప్పస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: అన్నదానం ఎంతో గొప్పదని 84 రోజులపాటు దీక్షలు ఆచరించే అయ్యప్ప, భవానీ, శివ, సాయి, ఆంజనేయ స్వామి భక్తులకు ఉచితంగా భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. కార్యక్రమంలో కొటికలపూడి గోవిందరావు, కోళ్ల నాగేశ్వరరావు, చెనమల్ల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన కనకదుర్గమ్మ

- దసరా శరన్నవరాత్రులు ప్రారంభం
- పలు ఆలయాల్లో కుంకుమ పూజలు
- స్వర్ణ రజిత కవచాలంకరణలో మావుళ్లమ్మ



ఉండి: దసరా ఉత్సవాల్లో పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



మెంటే వారి తోట చక్ర సహిత బాలా త్రిపుర సుందరీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత గ్రంధి రవితేజ



కాళ్ల: పెద అమీరం గ్రామంలో అమ్మవారిని దర్శించుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



భీమవరం (ప్రకాశం చౌక్): చిన్నారుల చేత ప్రారంభించిన దసరా శోభాయాత్ర



వీరవాసరం: రాయకుదురులో పూజలందుకుంటున్న అమ్మవారు



ఆకివీడు: బాలా త్రిపుసుందరి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

భీమవరం (ప్రకాశం చౌక్): పట్టణంలో దసరా మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పలు ఆలయాల్లో, ప్రధాన సెంటర్లలో దేవీ నవరాత్రుల మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. భీమవరం పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ నవరాత్రి మహోత్సవాల్లో మొదటిరోజు గురువారం స్వర్ణ రజిత కవచాలంకరణలో భక్తులకు దర్శిమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ కమిషనర్ మహాలక్ష్మీ నగేష్ ఆలయంలో ఏర్పాట్లు పరిశీలించారు.

పంచారామక్షేత్రంలో:
భీమవరం పంచారామక్షేత్రం దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయంలో కొలువైన పార్వతీదేవికి మహాలక్ష్మీ అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.కృష్ణంరాజు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మెంటేవారి తోటలో
స్థానిక మెంటేవారి తోటలోని శ్రీ విజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాలాత్రిపుర సుందరీదేవి ఆలయంలో దేవీ శరన్నరాత్రుల మహోత్సవాలను మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తనయుడు గ్రంధి రవితేజ సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఘనంగా ప్రారంభించారు. గురువారం అమ్మవారికి బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ కొటిపల్లిబాబు, ముత్యాల రామారావు, మద్దాల సత్యనారాయణ, కమిటి సభ్యులు పాల్గొన్నారు.

భీమేశ్వరస్వామి ఆలయంలో..
భీమేశ్వరస్వామి వారి ఆలయంలో వేంచేసియున్న శ్రీమహిషాసురమర్దనీ అమ్మవారికి దేవీ నవరాత్రుల మహోత్సవాల్లో మొదటిరోజు గురువారం స్వర్ణ రజిత కవచాలంకరణ నిర్వహించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో తోట శ్రీనివాస్, ఆలయ అర్చకులు, పాల్గొన్నారు. నాచువారి సెంటర్‌లోని శ్రీకనకదుర్గమ్మకు బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణ నిర్వహించారు. గునుపూడి గ్రామదేవత, ఆదిలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దసరా విజయీభవ శోభాయాత్ర
సాంప్రదాయబద్ధంగా దసరా విజయీభవ వేడుకలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అంజిబాబు సతీమణి పులపర్తి సత్యవాణి అన్నారు. భీమవరం మావుళ్లమ్మ దేవస్థానం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దసరా విజయీభవ శోభాయాత్రను సత్యవాణి ప్రారంభించి మాట్లాడారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సంప్రదాయాలను తల్లిదండ్రులు పిల్లలకు తెలియజేయాలని, దసరా విజయీభవ శోభాయాత్రతో శాంతి చేకూరుతుందన్నారు. అనంతరం చిన్నారులు అమ్మవారి వేషధారణలతో, కలశాలు, గరగలతో జైభవాని నినాదాలతో, పద్యాలతో దసరా విజయీభవ శోభాయాత్ర సాగింది. కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి బుద్దా మహాలక్ష్మీ నగేష్, బోండా వెంకట సుబ్బారావు, అరసవల్లి సుబ్రమణ్యం, గాదిరాజు రంగరాజు, కె.శిరీష, యర్రంశెట్టి హరినాథ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మీ అలంకరణలో అమ్మవారు
కాళ్ల: కాళ్లకూరులో వేంచేసియున్న స్వయంభు శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, మండలంలో పలు గ్రామాల్లో శ్రీ లక్ష్మీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8:34కు అమ్మవారి కలశ స్థాపన, శ్రీ చక్ర అభిషేకం నిర్వహించి, అమ్మవారిని మొదటి రోజు శ్రీ ఆదిలక్ష్మిగా అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద అమిరంలో వేంచేసియున్న అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘురామకష్ణరాజు, కోపల్లె సొసైటీ మాజీ అధ్యక్షులు వేగేశ్న జయ రామ కష్ణంరాజు దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావు, కటారి నరసింహారాజు, నడింపల్లి సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు
ఉండి: మండలంలోని 19 గ్రామాల్లో ఊరువాడా దసరా ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు కనకదుర్గమ్మ వారి ఆలయాలకు, ప్రతిమలు ప్రతిష్ఠించిన ప్రాంతాలకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉండి ఆర్యవైశ్య భవనంలో ప్రారంభించిన వాసవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బొండాడ సత్య, శ్యామల దంపతులు అమ్మవారికి పూజలు చేసినట్లు సంఘాధ్యక్షుడు మండ వెంకయ్య తెలిపారు. అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు కనువిందు చేశారని తెలిపారు. ఈ నెల 12న అమ్మవారికి మహా నివేదన సమర్పిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బొండాడ శివరామకృష్ణ, కనిగిళ్ల కృష్ణ, బొండాడ రాము, బొండాడ సత్యనారాయణ, దాసరి సురేష్, ఆలమూరి హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మా.. కరుణించమ్మా !
ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. దుర్గమ్మా.. కరుణించమ్మా అంటూ భక్తులు అమ్మవారి విగ్రహాల్ని పలు చోట్ల ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాల్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలోనూ, రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వర స్వామి ఆలయంలోనూ, పలు దేవాలయాల్లో బాలా త్రిపుర సుందరీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక జవహర్‌పేటలోని కనకదుర్గమ్మ, వనువులమ్మ, మాదివాడలోని గంగానమ్మ, మద్దిరావమ్మ, గంగానమ్మ, దానేశ్వరి అమ్మవార్ల ఆలయంలోనూ, చెరుకుమిల్లి, అయిభీమవరం, చినకాపవరం, పెదకాపవరం, గుమ్ములూరు, తదితర గ్రామాల్లో ప్రత్యేక అలంకరణలో అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు.

90 కేజీల భారీ లడ్డూ ప్రసాదం
ఆకివీడు: స్థానిక సిద్ధాపురం భక్తుడు ధూళిపాల కృష్ణ గురువారం కనకదుర్గమ్మకు 90 కేజీల లడ్డూను ప్రసాదంగా అందజేశారు. మండలంలోని అప్పారావుపేటలో నిర్వహిస్తున్న అమ్మవారి ఉత్సవాల్లో ఈ లడ్డూ ప్రసాదం అందజేశారు.

శరన్నవరాత్రి మహోత్సవాలు
వీరవాసరం: శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వీరవాసరం మండలంలో గురువారం అత్యంత వైభవ పీతంగా ప్రారంభమయ్యాయి. వీరవాసరంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం తోలేరులోని శ్రీ ప్రసన్న కనక దుర్గాదేవి ఆలయం, రాయకుదురు, మడుగు పోలవరం, నవుడూరు, అండలూరు తోకలపూడి, మత్స్యపురి, నందమూరి గరువు, చింతల కోటి గరువు పెరికిపాలెం, దూసనపూడి, మత్స్యపురి పాలెం, తదితర గ్రామాల్లో అమ్మవార్ల నవరాత్రి మహోత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు.

దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం
పాలకోడేరు: శృంగవృక్షం ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గురువారం దేవీ శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. సంఘం ఉపాధ్యక్షుడు కూర్మాల పూర్ణారావు, శిరీష దంపతులు కలశ స్థాపన చేసి, పూజలు ప్రారంభించారు. తొమ్మిది రోజులు వాసవీ మాతకు కుంకుమ పూజలు నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడు గ్రంధి రాజా తెలిపారు.

కూటమి ప్రభుత్వం 100 రోజుల్లోనే విఫలం



వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి మాట్లాడుతున్న జెడ్పీటీసీ రణస్థుల, ఎంపీపీ ఇందుకూరి

ఉండి: అధికారం చేపట్టి 100 రోజుల్లోనే కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు ఆధ్వర్యంలో ఎంపీపీలు, జడ్పీటీలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పార్టీ పరిస్థితిపైనా, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. దీంతో పార్టీ పురోభివృద్ధికి, విఫలమైన కూటమి ప్రభుత్వంపై ప్రజల పక్షంగా పోరాట విధివిధానాలపైనా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్న కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 100 రోజులు పూర్తి చేసుకొని పండుగ చేసుకుంటున్నారు. కాని ఇచ్చిన వాగ్దానాలు గాలికొదిలేశారని అన్నారు. సూపర్ సిక్స్ అంటూ ఊకదంపుడు వాగ్దానాలు చేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత వాటి ఊసే మరిచిపోయారన్నారు. అందుకే విఫలమైన కూటమి ప్రభుత్వంపై ప్రజాపక్షంగా పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారన్నారు. ఆయన చెప్పినట్టే తామంతా ముందుకు సాగుతామన్నారు. జడ్పీటీసీ, ఎంపీపీ రణస్థుల కనకదుర్గమహంకాళి, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలు నూటికి నూరుశాతం అమలు చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు పూర్తి వ్యతిరేకతతో ఉన్నారన్నారు. వైఎస్సార్‌సీపీ బలోపేతం దిశగా కొత్త కమిటీల ఏర్పాటు కార్యకర్తల్లో మనో ధైర్యం నింపడంతో పాటు మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ప్రజాపక్షంగా నిలబడతామని వారన్నారు. కార్యక్రమంలో కాళ్ల జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఆకివీడు జెడ్పీటీసీ యండగండి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ మనదే.. మంచి రోజులు వస్తున్నాయ్!

- చంద్రబాబును నమ్మే స్థితిలో జనం లేరు
- నియోజకవర్గ ఇన్‌చార్జితో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ వెల్లడి



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు,జెడ్పీటీసీ వెంకట్రాజు



జగన్‌ను కలిసిన గూడూరు ఉమాబాల, నియోజకవర్గ వైసీపీ నాయకులు

ఆకివీడు: భవిష్యత్ మనదేనని, మంచి రోజులు వస్తున్నాయని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పినట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ నాయకులతో ఆయనను కలిసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నాయకులతో జగన్ మాట్లాడుతూ ఎవరూ అధైర్యపడొద్దని, చీకటి వెనుకే వెలుగు వస్తుందని గుర్తించాలన్నారని పీవీఎల్ చెప్పారు. పార్టీని అంటిపెట్టుకొని ఉన్న వారికి మంచి భవిష్యత్ ఉంటుందని, ఇతర పార్టీల ప్రలోభాలకు గురికావద్దని చెప్పారన్నారు. చంద్రబాబు జీవితమే అబద్ధమని, తిరుపతి లడ్డూనే ఆయన అబద్ధాన్ని మరోసారి రుజువు చేసిందని వైఎస్ జగన్ చెప్పారని పీవీఎల్ తెలిపారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో నర్సాపురం పార్లమెంట్ నాయకురాలు గూడూరి ఉమాబాల, ఆకివీడు, కాళ్ల జెడ్పీటీసీలు వేగేశ్న వెంకట్రాజు, పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఆకివీడు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అంబటి రమేష్, ఉండి ఎంపీపీ శ్రీహరి నారాయణరాజు, రణస్థల మహంకాళి, వైస్ చైర్మన్ పుప్పాల పండు, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ జక్కీ, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి,ధర్మరాజు ఉన్నారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం: ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై మండల, గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆయన ఛాంబర్‌లో ధాన్యం కొనుగోళ్లపై ప్రొక్యూర్మెంట్ కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు అనుగుణంగా కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇందు కోసం సాంకేతిక శిక్షణలను నిర్ణీత గడువు లోపుగా పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి అధికారులు గోనె సంచులు, హమాలీలు, రవాణా వాహనాలు కొరత లేకుండా ప్రణాళికలు ఏర్పాటు చేసుకోవాల ని ఆదేశించారు. సివిల్ సప్లై జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, డీఎస్‌వో ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డీసీవో ఎం.నాగరాజు, ఆర్డీవో పి.ఉమామహేశ్వరరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి, సహాయ కంట్రోలర్ నాగరాజారావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామతంపూడి శ్రీరామరాజు పాల్గొన్నారు.

వరి పొలాల్లో నత్రజని వాడొద్దు



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

ఆకివీడు: ముంపు నుంచి బయట పడుతున్న వరి పొలాల్లో నత్రజని ఎరువు వాడొద్దని మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక సూచించారు. మండలంలోని అయిభీమవరం, కోళ్లపర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ ముంపు నీటిని బయటకు పంపేందుకు రైతులు చొరవ చూపాలన్నారు. నీరు పూర్తిగా బయటకు వెళ్లిన తరువాత పొటాష్ ఎరువు ఎకరాకు 20 కేజీలు చల్లాలన్నారు. వరిని తెగుళ్లు ఆశిస్తున్నాయన్నారు. బాక్టీరియా ఎండాకు తెగులుకు కోసైడ్ 2 గ్రాములు, ప్లాంటామైసిన్ 1 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. రైతులకు పంట నష్ట పరిహారంగా అయిభీమవరం గ్రామానికి రూ.28 లక్షలు రైతుల ఖాతాల్లో జమయ్యాయన్నారు. ఏడీఏ కె.శ్రీనివాసరావు, వెటర్నరీ డాక్టర్ భార్గవీ సత్య, కె.రామకృష్ణంరాజు, ఎం.రామారావు, శ్రీనుపాల్గొన్నారు.

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): మావుళ్లమ్మకు గురువారం హైదరాబాద్‌కు చెందిన మన్నే శ్రీనివాసరావు 6 గ్రాముల బంగారం సమర్పించారు. వారిచే అమ్మవారికి ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

వృద్ధాశ్రమంలో భోజనాలు



వృద్ధులకు భోజనాలు పెట్టిన దృశ్యం

భీమవరం: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకల్లో భాగంగా సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు అల్పాహారం భోజనం ఏర్పాటు చేశారు. ఉండి మండలం మహాదేవపట్నం సన్‌రైజ్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం, భీమవరం పట్టణంలోని వీరమ్మ చెరువు వద్దగల ప్రేమాలయం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అల్పాహారం, భోజనం, పండ్లు అందించారు. అపిలేట్ ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గా ప్రసాద్, సహాధ్యక్షుడు మట్లపూడి సత్యనారాయణ, కార్యదర్శి బోనం పాండురంగారావు, నిర్వహణ కార్యదర్శి, తాళ్లపూడి గాంధీ, సీహెచ్‌ఆర్‌వీవీ నాయుడు, పెన్మెత్స రామకృష్ణంరాజు, ఇంటి లక్ష్మణరావు, పి.లక్ష్మణవర్మ, కడియం ఈశ్వరరావు పాల్గొన్నారు.

బస్‌పాస్‌ల జారీ నిలిపివేత

నరసాపురం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లోని బస్‌పాస్‌ల జారీ కౌంటర్లు ఈనెల 5,6 తేదీల్లో పని చేయవని నరసాపురం ఆర్టీసీ డిపోమేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డిచెప్పారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ కారణంగా రెండురోజుల పాటు కౌంటర్లను మూస్తున్నామని చెప్పారు. మళ్లీ సోమవారం నుంచి కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయని విద్యార్థులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ ఆలోచనా విధానాలను కొనసాగించాలి

పాలకొల్లు అర్బన్: కూటమి ప్రభుత్వం అంబేడ్కర్ ఆలోచనా విధానాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు కోరారు. గురువారం పాలకొల్లులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న అన్ని దళితవాడల్లో రోడ్లు, డ్రెయినేజీ, మంచినీరు, ఇతర సామాజిక అవసరాలను తక్షణం పరిష్కరించడానికి నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ పనులను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించాలని పుష్పరాజు కోరారు. సమావేశంలో జిల్లా ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు నేతల సాల్మన్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిల్లే రాజ్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మద్రిపూడి నానిబాబు పాల్గొన్నారు.

సిద్ధాంతంలో సీపీఎం ధర్నా

పెనుగొండ: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బి బలరాం పిలుపు నిచ్చారు. గురువారం సిద్ధాంతంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరికేంచాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ చేసి, రావిచెట్టు సెంటర్‌లో ఆందోళన చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జేఎన్‌వీ గోపాలన్, కేతా గోపాలన్, చింతకాయల బాబూరావు, పీవీ ప్రతాప్, కౌరు పెద్దిరాజు పాల్గొన్నారు.